

మహిళల పుస్తెలు తెంపి..

లిక్కర్ వ్యాపారంతో మహిళల పుస్తెలు తెంచుతున్నారని ఈటల రాజేందర్ విమర్శించారు.

వివరాలు 8లో ▸



వైభవం.. వసంతోత్సవం

మన్యంకొండ అలివేలుమంగతాయారు ఉత్సవాల్లో వసంతోత్సవం నిర్వహించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /19.5

వాతావరణం

మధ్యాహ్నం తీవ్ర ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. రాత్రి కొద్దిమేర చలి ఉంటుంది.

అడుగంటుతున్న కృష్ణమ్మ

శ్రీశైలం జలాశయంలో క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం

- ఎల్లూరు సమీపంలోని కేఎల్ఐ వద్ద 821 అడుగుల ఎత్తులో నీళ్లు
- 800 అడుగుల వరకు మిషన్ భగీరథకు వెసులుబాటు
- అవసరమైతే రివర్స్ పంపింగ్ ద్వారా నీటి ఎత్తిపోత
- నీటి నిల్వ, సరఫరాపై అధికారుల సమాలోచనలు



కేఎల్ఐ సమీపంలోని కోతిగుండు వద్ద కృష్ణానదిలో తగ్గిపోయిన నీటిమట్టం

కొల్లాపూర్: కృష్ణానదిలో నీటిమట్టం క్రమంగా అడుగంటుతోంది. శ్రీశైలం బ్యాక్‌వాటర్ క్రమేపీ తగ్గుతుండడంతో ప్రభుత్వ యంత్రాంగం తాగు, సాగునీటి సరఫరాపై దృష్టిసారించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు రంగారెడ్డి జిల్లాలోని కొన్ని మండలాలకు కొల్లాపూర్ నియోజకవర్గంలోని మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందుతోంది. దీంతో కృష్ణానదిలో నీటిమట్టం, పంపింగ్, సరఫరా అంశాలను మిషన్ భగీరథ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. గతేడాది వేసవి ముగింపులో రివర్స్ పంపింగ్ ద్వారా తాగునీరు అందించాల్సి వచ్చింది. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వల ప్రకారం మరో రెండు నెలల వరకు తాగునీటి సరఫరాకు ఢోకా ఉండదని అధికారులు చెబుతున్నారు.



మిషన్ భగీరథ సంప్‌వెల్

'పాలమూరు' ప్రారంభమైతేనే..

మిషన్ భగీరథకు నీటిని అందించే ఎల్లూరు రిజర్వాయర్‌లో నీటినిల్వ సామర్థ్యం కేవలం 0.36 టీఎంసీలు మాత్రమే. మిషన్ భగీరథ ద్వారా ప్రతిరోజూ 0.02 టీఎంసీ నీటిని తాగునీటి కోసం సరఫరా చేస్తున్నారు. ఎల్లూరు రిజర్వాయర్‌లో అధికంగా నీటినిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో తాగునీటికి ఇక్కట్లు ఎదురవుతున్నాయి. కేఎల్ఐ సమీపంలోనే పాలమూరు ప్రాజెక్టు పంప్‌హౌజ్ నిర్మిస్తున్నారు. దానికి అనుసంధానంగా ఎల్లూరు రిజర్వాయర్ పక్కనే 8 టీఎంసీల సామర్థ్యంతో నార్లాపూర్ రిజర్వాయర్ నిర్మిస్తున్నారు. పాలమూరు ప్రాజెక్టు ప్రారంభమై, నార్లాపూర్ రిజర్వాయర్‌కు మిషన్ భగీరథ ప్రాజెక్టును అనుసంధానిస్తే తాగునీటి సమస్య పూర్తిస్థాయిలో తీరుతుంది.



ఎల్లూరు సమీపంలోని మిషన్ భగీరథ పంప్‌హౌజ్

800 అడుగుల వరకు

శ్రీశైలంలో బ్యాక్ వాటర్ లెవల్స్ క్రమంగా తగ్గుతున్నాయి. ఫిబ్రవరి మొదటి వారం నుంచి నీటిమట్టం తగ్గడం ప్రారంభమైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు, 215.8070 టీఎంసీలు కాగా.. గురువారం సాయంత్రం నీటిమట్టం 821.2 అడుగులు, 41.6978 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కేఎల్ఐ ద్వారా 800 అడుగుల వరకు నీటిని పంపింగ్ చేయవచ్చు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వల ప్రకారం మే నెల వరకు తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. 800 అడుగుల దిగువకు నీటినిల్వలు పడిపోతే ప్రభుత్వ అనుమతితో ఎత్తిపోయాల్సి ఉంటుంది. ఒకవేళ నిల్వలు భారీగా తగ్గితే మాత్రం రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని ఎత్తిపోయాలి. గతేడాది ఈ విధానాన్ని అమలుచేశారు.

ప్రస్తుతానికి ఇబ్బంది లేదు



ప్రస్తుతం తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవు. కృష్ణా బ్యాటర్ కేఎల్ఐ ప్రాజెక్టు వద్ద 821 అడుగుల ఎత్తులో ఉంది. 800 అడుగుల వరకు తాగునీటి అవసరాలకు నీటిని ఎత్తిపోసుకోవచ్చు. నీటి లభ్యతకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురైతే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

– అంజాద్ పాషా, డీఈఈ, మిషన్ భగీరథ

ఉన్నతాధికారులకు నివేదిక

కృష్ణానదిలో తగ్గుతున్న నీటి నిల్వ, మిషన్ భగీరథ పథకం నిర్వహణ అంశాల గురించి పంప్‌హౌజ్ డీఈ అంజాద్‌పాషా, నీటి సరఫరా నిర్వహణ డీఈ రమేష్‌కుమార్ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నారు. తాగునీటికి ఇబ్బందులు ఎదురైతే తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది. నీటి కొరత ఏర్పడితే రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు కూడా అవసరమైన అనుమతులు తీసుకునే యోచనలో ఉన్నారు.

ఎల్లూరు నుంచి తాగునీరు

మిషన్ భగీరథ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కేఎల్ఐ ప్రాజెక్టుకు అనుసంధానంగా కొల్లాపూర్ మండలం ఎల్లూరులో పంప్‌హౌజ్ నిర్మించింది. ఇక్కడి నుంచి ఉమ్మడి పాలమూరుతో పాటు రంగారెడ్డి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 84 మండలాల ప్రజలకు తాగునీరందించేందుకు పైప్‌లైన్లు, వాటర్ ట్యాంకులు నిర్మించారు. ఇందుకోసం రూ.5,478 కోట్లు ఖర్చు చేసింది. కేఎల్ఐ ద్వారా ఎల్లూరు రిజర్వాయర్‌లోకి కృష్ణానీటిని ఎత్తిపోసి, అక్కడే నీటిని ఫిల్టర్ చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తారు. ఇందుకోసం ఎల్లూరులో రూ.120 కోట్లతో పంప్‌హౌజ్, ఫిల్టర్‌బెడ్స్ నిర్మించారు.

న్యూస్‌రీల్

రైతు సంక్షేమం కోసం కృషి



అచ్చంపేట రూరల్: దేశంలో ఏ ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో కొనసాగుతున్నాయని, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన అచ్చంపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న రైతులతో మాట్లాడి యార్డులో కల్పిస్తున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో దళారీ వ్యవస్థ లేకుండా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే రైతులకు యార్డులో సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. గిట్టుబాటు ధర విషయంలోనూ ఉన్నతాధికారులతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు పెట్టుబడి సాయం, సాగునీరు అందించడంతో రికార్డు స్థాయిలో పంటలు పండిస్తున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ప్రతి క్లస్టర్ పరిధిలో రైతు వేదికలు, గోదాంలు నిర్మించామన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణ, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నిజాం, ఆంజనేయులు, మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గుండె పరీక్షలు తప్పనిసరి



బిజినేపల్లి: ప్రస్తుత పరిస్థితుల్లో గుండె సంబంధిత సమస్యలతో చనిపోతున్న వారి సంఖ్య పెరుగుతున్నందున ప్రతిఒక్కరు గుండె పరీక్షలు చేయించుకోవాలని, గుండె సమస్యపై అనుమానం ఉన్నవారు తక్షణమే 2డీ–ఈకో పరీక్ష చేసుకోవాలని డీఎంహెచ్ఓ సుధాకర్ లాల్ అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల్లో సైతం గుండె పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. గురువారం పాలెం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్లలోపు వారిలో గుండె ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం బృందం ద్వారా 42 మందిని గుర్తించామన్నారు. అందులో 35 మంది చిన్నారులకు అపోలో ఆస్పత్రి వారు నిర్వహించిన శిబిరంలో గుండె పరీక్షలు చేశారన్నారు. వీరిలో 15 మందికి శస్త్రచికిత్స అవసరమని, అందుకు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు.

మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం



కందనూలు: సామాజిక తనిఖీ జవాబుదారితనం, పారదర్శకత సంస్థ హైదరాబాద్‌కు చెందిన అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలో రెండు పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌తోపాటు అమ్రాబాద్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు ఆయా పాఠశాలల విద్యార్థుల నమోదు, ఆ రోజు ఉపస్థితి అయిన వారి వివరాలతోపాటు ప్రభుత్వం నుంచి వచ్చే బియ్యం నాణ్యత, కూరగాయలు, తదితర సరుకుల నాణ్యత అంశాలను పరిశీలించారు. అనంతరం జిల్లాకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు, వంట ఏజెన్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ గోవిందరాజులు మాట్లాడుతూ జిల్లాలోని 825 పాఠశాలల్లో 68 వేల మంది విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఎలాంటి బిల్లులు పెండింగ్‌లో లేవన్నారు. అనంతరం తనిఖీ సభ్యుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనం రుచికరంతోపాటు వసతులు మరింత మెరుగుపరచాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కుర్మయ్య, సామాజిక తనిఖీ సంస్థ సభ్యులు నీరజ, నిరోష, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను పాఠశాలకు పంపించండి

మన్ననూర్: విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని తమ పిల్లలను ఇంటి నుంచి పాఠశాలకు పంపించాలని టీఎస్ ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ఆర్‌సీఓ వనజ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మన్ననూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన ఘటన దురదృష్టకరం అన్నారు. గురువారం పాఠశాలను సందర్శించిన ఆమె ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మృతి చెందిన చిన్నారి నిఖిత ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల రక్షణ, కనీస మౌళిక సదుపాయాల కల్పనలో పూర్తి బాధ్యత, భద్రత కల్పిస్తామన్నారు. ప్రత్యేకించి పరీక్షల సమయం అయినందున ఇంటికి వెళ్లిన విద్యార్థులను తక్షణమే తీసుకు రావాలని కోరారు. సంఘటనకు బాధ్యులను చేస్తూ కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రిన్సిపల్ లలితకుమారిని సస్పెండ్ చేసి, సీనియర్ లెక్చరర్ రాజ్యలక్ష్మికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించామన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం ఇప్పటికే ప్రభుత్వం రూ.22 లక్షలు విడుదల చేసిందని, వాటితో అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

వేరుశనగ @ రూ.7,269



కల్వకుర్తి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చిన వేరుశనగకు అత్యధికంగా రూ.7,269 ధర లభించింది. గత ఆదివారం రూ.7,429 ధర లభించగా.. దాదాపు రూ.200 తగ్గింది. మధ్యస్తంగా రూ.7,100, అతి తక్కువగా రూ.5,012లకు వ్యాపారులు వేరుశనగ కొనుగోలు చేశారు. ఈ క్రమంలో గురువారం 217 మంది రైతులు 7,288 బస్తాలలో 2,186 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి తెచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మార్కెట్‌లో అన్ని ఏర్పాట్లు చేశామని మార్కెట్ కార్యదర్శి భగవంత్ చెప్పారు.

చెంచు గర్భిణులకు 'టిఫా' స్కానింగ్



బల్మూర్ పీహెచ్‌సీలోని చెంచు గర్భిణులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

బల్మూర్: చెంచు గర్భిణులకు జిల్లాకేంద్రంలో ప్రత్యేకంగా టిఫా స్కానింగ్ కేంద్రం ఏర్పాటు చేసి ప్రసవ సమయం వరకు వారిలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోనున్నట్లు కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టర్ స్థానిక పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నెలవారి పరీక్షల కోసం వచ్చిన గర్భిణులతో మాట్లాడి సమస్యలు, లోపాలను అగిడి తెలుసుకున్నారు. టిఫా స్కానింగ్ అందుబాటులో లేకపోవడం వల్ల అన్ని రకాల పరీక్షలు చేయించుకోలేకపోతున్నామని గర్భిణులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో వెంటనే ఆయన స్పందించి ప్రధానంగా చెంచు గర్భిణుల కోసం జిల్లాకేంద్రంలోని ఆస్పత్రిలో ప్రత్యేకంగా టిఫా స్కానింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. టిఫా స్కానింగ్ వలన శిశువు లోపాలను గర్భస్థ దశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి లోపాలు లేకుండా జన్మిస్తారని సూచించారు. అచ్చంపేట ఆస్పత్రిలో ఆరోగ్య సమస్యలు ఉన్న గర్భిణుల కోసం ప్రత్యేక గది, ఆహారం ఏర్పాట్లు చేయించామన్నారు. అనంతరం పీహెచ్‌సీలో కలియదిరిగి రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కొండనాగులలో కంటి వెలుగు శిబిరాన్ని, పాఠశాలను పరిశీలించారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు

నాగర్‌కర్నూల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, సన్నద్ధతపై ఏఈఆర్ఓలు, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 14 పోలింగ్ స్టేషన్లు, 6 రూట్లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో మొత్తం 1,822 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,169, మహిళలు 653 ఉన్నారన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్ క్యాస్టింగ్ కెమెరాలు ఏర్పాటు చేశామని, అవసరమైన ర్యాంప్, వీల్‌చైర్, విద్యుత్, మరుగుదొడ్లు తదితర అన్ని రకాల సౌకర్యాలు ముందుగానే చూసుకోవాలని సూచించారు. 12న నాగర్ కర్నూల్ జెడ్పీ హైస్కూల్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. రూట్ మొబైల్ పార్టీ, ప్రతి పోలింగ్ స్టేషన్ దగ్గర పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికలు పూర్తయ్యాక బ్యాలెట్ బాక్సులను ఎస్కార్ట్‌తో హైదరాబాద్‌కు తరలించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మనుచౌదరి, ఏఎస్పీ రామేశ్వర్‌రావు, ఆర్డీఓలు, ఏఓ శ్రీనివాస్, సీ సెక్షన్ సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

పరీక్షలకు సన్నద్ధం కావాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈఓ గోవిందరాజులు

కందనూలు: విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం, తూడుకుర్తి గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రత్యేక ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తగు సూచనలు చేయాలన్నారు. సామర్థ్యాలను మరింతగా పెంచే విధంగా ఉపాధ్యాయులు, తొలిమెట్టు కార్యక్రమాన్ని పాఠశాలలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పదో తరగతి పరీక్షలకు ఇంకా మూడు వారాల గడువు మాత్రమే ఉందని, సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలకు సన్నద్ధం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని చెప్పారు. అనంతరం ఆయా పాఠశాలల్లో కొనసాగుతున్న మన ఊరు– మన బడి పనులను పరిశీలించారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం జరిగే ప్రత్యేక తరగతులను పరిశీలించి, స్నాక్స్ అందజేశారు. డీఈఓ వెంట స్ట్రాంగ్ టీచర్ వెంకటేశ్వరశెట్టి, హెచ్ఎంలు వెంకటయ్య, ఉపాధ్యాయుడు లక్ష్మణ్ తదితరులున్నారు.

ఆత్మాభిమానం చంపుకోలేకే రాజీనామా

- బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పిన వనపర్తి జెడ్పీ చైర్మన్, ఇద్దరు ఎంపీపీలు, 11 మంది సర్పంచ్‌లు, ఆరుగురు ఎంపీటీసీలు



రాజీనామా పత్రాలను చూపుతున్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు

వనపర్తి: 'పదవులపై వ్యామోహంతోనో.. అక్రమార్జన కోసమో రాజకీయాల్లో కొనసాగడం లేదు. మావంతుగా ప్రజలకు సేవ చేద్దామని వస్తే.. అడుగడుగునా ఆంక్షలు, అడ్డంకులు సృష్టిస్తూ ఉద్దేశపూర్వకంగా కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఆత్మాభిమానం చంపుకోలేక.. పార్టీలో ఉండలేక రాజీనామా చేస్తున్నాం..' అని వనపర్తి జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, మరికొంతమంది ప్రజాప్రతినిధులు వెల్లడించారు. గురువారం ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపూర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ మేరకు జెడ్పీచైర్మన్, ఇద్దరు ఎంపీపీలు, 11 మంది సర్పంచ్‌లు, 6 మంది ఎంపీటీసీ సభ్యులు, పలువురు ఉపసర్పంచ్‌లు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు, డైరెక్టర్లతో కలిసి రాజీనామా పత్రాలపై సంతకాలు చేసి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడికి పంపించారు. అనంతరం జెడ్పీచైర్మన్ విలేకరులతో మాట్లాడారు. తాను రాజకీయాలకు వచ్చింది డబ్బు సంపాదించడానికి, పదవులు అనుభవించడానికి కాదని, నా వంతుగా ప్రజలకు మంచి చేయాలని రెండు దశాబ్దాలుగా పలు పదవుల్లో కొనసాగుతున్నానన్నారు. కానీ, పంచాయతీ వార్డు సభ్యుడి నుంచి జెడ్పీచైర్మన్ వరకు అందరి విధులు తానే చేయాలని మంత్రి అనుకోవడం, నిధుల ఖర్చు కూడా తాను చెప్పినట్లే చేయాలనుకుంటే మేమంతా ఎందుకు అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పాలన ఇలాగే ఉందా.. ఒక్క వనపర్తిలోనే ఉందా అని ప్రశ్నించారు. జిల్లా ఏర్పాటు తర్వాత తొలి జెడ్పీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి గ్రామీణ ప్రాంతంలో విద్య, వైద్య సౌకర్యాలు మెరుగుచేయాలని ప్రమాణ స్వీకారం చేసినప్పుడే సంకల్పించుకున్నానని చెప్పారు. కానీ, ఏ పనిచేసేందుకు ముందుకెళ్లినా ఆంక్షలు పెడుతూ జెడ్పీకి ప్రభుత్వం కేటాయించిన నిధులు సైతం తాను చెప్పిన పనులకు వెచ్చించాలని చెప్పడంతో ప్రశ్నించానన్నారు. నాటి నుంచి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ కార్యక్రమాలకు రానివ్వకుండా, కనీసం మాట్లాడేందుకు సమయం ఇవ్వలేదన్నారు. అలాగే, నిధులు వెచ్చించేందుకు సమావేశాలకు జెడ్పీటీసీలను రానివ్వకుండా పార్టీని వీడేలా చేసింది మంత్రి కాదా అని ప్రశ్నించారు. రేపటి నుంచి ప్రజాక్షేత్రంలోకి వెళ్లి వారి అభిప్రాయం మేరకు ఏ పార్టీలో చేరాలి.. కార్యాచరణ ఏమిటనే విషయం వెల్లడిస్తానని లోక్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

- పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి మాట్లాడుతూ రూ.కోట్లు వెచ్చించి రాత్రింబవళ్లు కష్టపడి దగ్గరుండి కాల్వల పనులు చేయించి సాగునీళ్లు తీసుకొస్తే.. బినామీ పేర్లతో ఎంబీలు చేసుకుని నిధులు, నీళ్ల నిరంజన్‌రెడ్డి అనే పేరును మంత్రి తెచ్చుకున్నారని విమర్శించారు. తామంతా కలిసి 2018 ఎన్నికల్లో పనిచేస్తేనే ఎమ్మెల్యేగా గెలుపొందావనే విషయం మంత్రి విస్మరించడం సరికాదన్నారు.
- వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి మాట్లాడుతూ చిన్న కుగ్రామం నుంచి జిల్లాకేంద్రం వరకు ప్రతిచోట రెండు గ్రూపులుగా నాయకులను విభజించి పబ్బం గడుపుకోవడం మంత్రి హోదాకు తగదన్నారు. 25 ఏళ్లుగా ఓటమిలేని నాయకుడిగా ఎదిగిన నేను.. అభివృద్ధి పనుల కోసం ఈ సారైనా అధికార పక్షంలో ఉండాలని, మీ ఆహ్వానం మేరకు గులాబీ కండువా కప్పుకున్నానని, కానీ ఏ హామీ నెరవేర్చలేదన్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



ప్రారంభ పూజలు చేస్తున్న వేదపండితులు

కందనూలు: జిల్లాకేంద్రంలోని టీచర్స్‌కాలనీలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి, సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో షష్ఠిక వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ధ్వజారానతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలస్వామి మాట్లాడుతూ స్వామివారికి తెల్లవారుజామున నిత్య పూజలు, వేదమంత్రోచ్చరణాల మధ్య జరిపించారు. ప్రత్యేకంగా యజ్ఞాచార్యులు ఎడవల్లి శ్రీహరి ఆచార్య ఆధ్వర్యంలో వైనతేయ హోమం శాస్త్రోక్తంగా చేశారు. సంతానం కలగని జంటలకు గరుడప్రసాదాన్ని పూజ అనంతరం పంపిణీ చేశామన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు మహాలక్ష్మి అమ్మవారికి మహా కుంభాభిషేకం, వేదమంత్రాలతో నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామివారి తిరు కల్యాణం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

పెద్దకొత్తపల్లి: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని నక్కలపల్లిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బండి నర్సింహ(50) అనే రైతు గురువారం తన వ్యవసాయ పొలం వద్ద వరిపంటకు నీరు అందించేందుకు బోరు మోటార్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పొలంలో మినుము పంట కోస్తున్న కుటుంబ సభ్యులు కొద్దిసేపటి తర్వాత అటుగా వెళ్లగా నర్సింహ శవమై కనిపించడంతో బోరున విలపించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వజ్రం తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి..

బాలానగర్: బాలానగర్‌లోని రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (36) మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య తెలిపిన వివరాలు.. గురువారం తెల్లావారు జామున బాలానగర్ రైల్వే వంతెన సమీపంలో ట్రెయిన్ ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై మృతి చెందాడు. సమాచారం అందడంతో బాలానగర్ ఎస్సై జయప్రసాద్ పరిశీలించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ తరలించారు. బ్లూ కలర్ టీషర్టు, క్రీమ్ కలర్ పాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ కోసం జీఆర్‌బీ పోలీస్ స్టేషన్ మహబూబ్‌నగర్‌ని సంప్రదించాలని సూచించారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం

- ప్రేమ వ్యవహారమే కారణం?

దేవరకద్ర: మండల కేంద్రంలోని రైల్వే గేటుకు సమీపంలో రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్ రూరల్ మండలం మాచన్‌పల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్ (20) దేవరకద్రలోని తన బంధువు ఇంట్లో ఉంటూ పని చేసుకుంటున్నాడు. గురువారం 11 గంటల ప్రాంతంలో కర్నూలు వైపు వెళ్లే రైలు కింద పడి వెంకటేశ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణమని తెలుస్తోంది. రైల్వే పోలీసులు మృతదేహాన్ని జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని కార్మికుడు..

గద్వాల క్రైం: ఉరేసుకుని మున్సిపల్ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అబ్దుల్ షకూర్ కథనం మేరకు... అంబేద్కర్ కాలనీకి చెందిన రామక్రిష్ణ (30) గద్వాల మున్సిపాలిటీలో ఒప్పంద కార్మికుడిగా పని చేస్తున్నాడు. అయితే గురువారం ఉదయం పనులు ముగించుకుని ఇంటికి వెళ్లాడు. ఇంట్లో భార్యాభర్త మధ్య చిన్నపాటి వివాదం చోటుచేసుకుంది. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. భార్య జయశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

దళారీల బంధు



అర్హులుగా గుర్తించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జేపల్లి గ్రామస్తులు (ఫైల్)

- చారకొండ పైలెట్ ప్రాజెక్టులో అక్రమాలు
- పథకం అమలుపై అధికారుల పర్యవేక్షణ కరువు



గేదెలు లేకుండా ఖాళీగా షెడ్

చారకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకం అభాసుపాలవుతోంది. దళితులను అభివృద్ధి చేసేందుకు గాను ఈ రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా చారకొండ మండలం ఎంపికైంది. అయితే ఇక్కడ దళితబంధు పథకంతో లబ్ధిదారులకు చేరేది కొంత అయితే.. ఎక్కువగా లాభపడేది మాత్రం మధ్యదళారీలేనని లబ్ధిదారులు వాపోతున్నారు. మండలంలో పథకం కింద 1,407 మందిని అర్హులుగా గుర్తించారు. ఇందులో 1,302 మందికి యూనిట్ల వారీగా గ్రౌండింగ్ పూర్తి చేశారు. మంజూరైన యూనిట్లు పూర్తిస్థాయిలో అమలు కాలేదు. యూనిట్ల ఏర్పాటు లేకున్నా కొందరు దళారులతో కుమ్మక్కై అధికారుల సహకారంతో లబ్ధిదారులకు డబ్బులు ఇప్పిస్తూ మధ్యవర్తులు తమ జేబులు నింపుకొంటున్నారు. చారకొండ మండల కేంద్రంలో లబ్ధిదారులు యూనిట్‌ను ప్రారంభించకుండానే వస్త్ర దుకాణాల పేరిట కొటేషన్ సృష్టించారు. లబ్ధిదారుల ఖాతాలో రూ.9.90 లక్షలు డబ్బులు జమ కాగానే.. ఇందులో పెద్దమొత్తంలో దళారులు తమ జేబులో వేసుకుని.. మిగతాది లబ్ధిదారుకు అందజేసినట్లు సమాచారం.

ఉన్నతాధికారుల పర్యవేక్షణేదీ?

పథకంలో లబ్ధిదారులుగా ఎంపికైనా వారికి అధికారులు వారు ఎంచుకున్న యూనిట్‌ను అందజేశారు. యూనిట్ అమలు, వాటి నిర్వహణ, లబ్ధిదారుల స్థితిపై ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలి. కానీ, వీటిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో యూనిట్ వినియోగం దుర్వినియోగమవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు మండలంలోని జేపల్లి, తిమ్మాయిపల్లి, చారకొండ, జూపల్లి తదితర గ్రామాల్లో అర్హత ఉన్న చాలామందిని అధికారుల నిర్లక్ష్యం వల్ల అర్హులుగా గుర్తించలేదు. దీంతో తమను లబ్ధిదారులుగా చేర్చాలని పలుమార్లు పంచాయతీ అధికారి నుంచి కలెక్టర్ వరకు వినతిపత్రాలు అందించినా ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు.

మెజారిటీ గ్రామాల్లో ఇలాగే..

చారకొండ మండలంలోని మెజారిటీ గ్రామాల్లో ఇదే పద్ధతి అవలంబించినట్లు తెలుస్తోంది. డైరీ ఫాం, సిమెంట్ షాపుల యూనిట్ల పేరిట భారీగా మోసాలకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డైరీ యూనిట్లకు సంబంధించి తమిళనాడు గేదెల కొనుగోలులో మధ్య దళారీలు తమ చతురత చూపించినట్లు తెలిసింది. అలాగే ట్రాక్టర్లు, బొలెరోలు, కార్లకు సంబంధించి ప్రతి యూనిట్‌పై ఆయా గ్రామాలకు చెందిన అధికార పార్టీ నేతలు, కార్పొరేషన్ అధికారులు షోరూంలతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారు.

అర్హులను గుర్తించాలి



జేపల్లిలో అర్హులుగా 16 కుటుంబాలు ఉన్నా.. అధికారుల నిర్లక్ష్యంతో దళితబంధు పథకానికి దూరమయ్యారు. వారిని అర్హులుగా గుర్తించమని పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓ, కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రాలు అందించినా ఫలితం లేకపోయింది. పైలెట్ ప్రాజెక్టులో అందరికీ లబ్ధి చేకూరుతుందనుకున్నాం. కానీ, నిరుపేదలైన మాకు అందకపోవడం బాధాకరం.

– రమేష్, జేపల్లి

రూ.7.20 లక్షలే ఇచ్చారు..



దళితబంధు పథకంలో యూనిట్ మంజూరు కావడంతో టెంట్‌హౌజ్ పెట్టుకున్నాను. టెంట్ హౌజ్‌కు హైదరాబాద్ పేరిట కొటేషన్ తెచ్చి మధ్యవర్తుల ప్రమేయంతో ట్రాన్స్‌పోర్టు, జీఎస్టీ పేరుతో కలిసి మొత్తం యూనిట్ మీద రూ.2.70 లక్షలు కట్‌చేసి రూ.7.20 లక్షలు మాత్రమే ఇచ్చారు.

– కొవ్వు బక్కమ్మ, చారకొండ

ప్రజల పక్షాన పోరాడుదాం



జిల్లా ఇన్‌చార్జ్‌గా నియామక పత్రం అందజేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్
- ముగిసిన బహుజన రాజ్యాధికార మొదటి విడత యాత్ర
- బీఎస్పీ నాయకులతో సమావేశం

అలంపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేద్దామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. అలంపూర్ చౌరస్తాలో బీఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఎస్పీ ఆధ్వర్యంలో గత నెల 26వ తేదీ నుంచి ప్రారంభమైన బహుజన రాజ్యాధికార మొదటి విడత యాత్ర గురించి చర్చించారు. నియోజకవర్గంలోని అలంపూర్, ఉండవెల్లి, ఇటిక్యాల, మానవపాడు మండలంలోని 36 గ్రామాల్లో పది రోజులపాటు యాత్ర సాగినట్లు తెలిపారు. బహుజన రాజ్యాధికార యాత్ర సాగిన తీరును, ఇతర అంశాలను సమావేశంలో చర్చించారు. రైతు సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో ఉన్న ప్రధాన సమస్య ఆర్డీఎస్, తుమ్మిళ్ల అని రైతులకు ఇబ్బందులు లేకుండా వారికి అండగా ఉద్యమించాలని సూచించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పార్టీ నాయకులు కృషి చేయాలని వివరించారు. రెండో విడత బహుజన రాజ్యాధికార యాత్రపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్‌గా ఇటిక్యాల మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన ఎంజీ కృష్ణను, అలంపూర్ మండల ఆర్గనైజర్‌గా బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన నాగరాజు నాయుడును నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. అక్కడి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు ఫోన్‌లో తెలిపారు. ఇబ్బంది కలిగిస్తే వారితో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందికంటి విజయ్‌కుమార్, నాయకులు రాములమ్మ, మహేష్, కనకం బాబు తదితరులు ఉన్నారు.

12న ప్రవేశ పరీక్ష

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలల్లో 2023–24కు గాను ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈనెల 12వ తేదీ ఉదయం పది గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రాంతీయ సమన్వయ అధికారి కె.నాగార్జున రావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికోసం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు https://www.tgtwgurukulam.telangana.gov.in నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఉదయం తొమ్మిది గంటలలోపు కేటాయించిన సెంటర్లలో హాజరుకావాలన్నారు.

కేంద్రాల వివరాలిలా ఉన్నాయి.

- తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (మహిళలు), తిరుమల హిల్స్, అప్పన్నపల్లి, మహబూబ్‌నగర్, ఫోన్ నం .7901097704.
- తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (పురుషులు), మాచారం, జడ్చర్ల, ఫోన్ నం.7901097704.
- తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల (బాలికలు), మద్రికుంట, వనపర్తి, ఫోన్ నం.9490957315.
- తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల (బాలికలు), కల్వకుర్తి, ఫోన్ నం.9490957316.
- తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (పీటీజీ–బాలుర), మన్ననూర్, ఫోన్ నం.9490957314.

నేడు బండి సంజయ్ రాక

పాలమూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరుకానున్నారు. జిల్లాకేంద్రంలోని సురేష్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం జరిగే కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో కోరారు.

నిండుకుండలా రామన్‌పాడు ప్రాజెక్టు

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో గురువారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉంది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 920 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 97క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగు తుంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 950 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

మహిళల పుస్తెలు తెంపి ఆదాయం గడిస్తారా?

- తండ్రి ఆబ్కారి శాఖతో రాష్ట్ర ఖజానా నింపుతున్నడు
- కూతురు లిక్కర్ స్కాంలో ఇరుక్కుని తెలంగాణ పరువు తీస్తోంది
- బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

నారాయణపేట రూరల్: తెలంగాణలో తండ్రీకూతురు కలిసి లిక్కర్ వ్యాపారంతో మహిళల పుస్తెలు తెంచి తమ ఆదాయం పెంచుకునేందుకు కృషి చేస్తున్నారని, తద్వారా ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేలా చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఈటల రాజేందర్ విమర్శించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డికి మద్దతుగా తపస్ ఆధ్వర్యంలో నారాయణపేటలో గురువారం రాత్రి నిర్వహించిన టీచర్ల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తప్పు చేస్తే ఎంతటివారినైనా శిక్షిస్తామని, తన కొడుకు, కూతురైనా వెనుకాడనని చెప్పిన సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత విషయంలో ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. ఆడపిల్ల అయివుండి లిక్కర్ స్కాంలో ఇరుక్కోవడం తెలంగాణ రాష్ట్రానికే అవమానమని, మహిళలు సిగ్గుతో తలదించుకునే విషయమని అన్నారు. మరోపక్క కేసీఆర్ కేవలం తాగుడు ద్వారా వచ్చే ఆదాయంతోనే రాష్ట్రాన్ని నడుపుతున్నారని, ఎక్సైజ్ ఆదాయం రావడంతో దేశంలోనే నంబర్‌వన్ స్థానానికి తెలంగాణను తీసుకునివెళ్లారని అన్నారు. ఎక్సైజ్ డబ్బులతోనే ఉద్యోగుల జీతాలు ఇస్తున్నారని విమర్శించారు.

మండలిలో మాట్లాడే వ్యక్తి కావాలి..

శాసనసభలో ప్రజల గొంతుక వినిపించడానికి ఇద్దరం ఉన్నామని, మండలిలో సైతం మాట్లాడటానికి ఒక వ్యక్తిని పంపించాలని, తమ కర్తవ్యానికి తోడును అందించడానికి ఏవీఎన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తాను ప్రజల మనిషినని, సమస్యలపై గొంతు ఎత్తుతానని అన్నారు. ప్రతిపక్షాలు లేకుండా కేసీఆర్ చేసే కుట్రను భగ్నం చేద్దామని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్‌కు చెందిన 105మంది ఎమ్మెల్యేలకు గుణపాఠం చెప్పేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రాజరిక పాలన కొనసాగిస్తున్నారని, సంపూర్ణ అవగాహన, విచక్షణ ఉన్న ఉపాధ్యాయులు సరైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో కేర్ టేకర్‌ను నియమించాలని, కేసీఆర్ ఇచ్చిన హామీలో భాగంగా పండిత్, పీఈటీల అప్‌గ్రెడేషన్, కాంట్రాక్ట్ వ్యవస్థ రూపుమాపేందుకు పోరాటం చేస్తామన్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ ఆటోమెటిక్ రివైజ్డ్ విధానం తీసుకుని వచ్చేందుకు ఒత్తిడి తెస్తామన్నారు. సీపీఎస్ విధానం వల్ల ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు పదవీ విరమణ తర్వాత పెన్షన్ లేక వారి సంతానం పట్టించుకోవడంలేదన్నారు. ఈ విధానంపై ఆలోచించాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశంలో తపస్ జిల్లా అధ్యక్షులు శేర్ కృష్ణారెడ్డి, నర్సింహా, గుంపుబాలరాజు, నాగార్జున్‌రెడ్డి, బీజేపీ నాయకులు నాగురావునామాజి, రతంగపాండురెడ్డి, పీ.శ్రీనివాసులు, ప్రభాకర్‌వర్ధన్, డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ నిర్వీర్యం..

మాతృభాషలో విద్యాబోధనను తుంగలో తొక్కి, ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే చర్యలను కేసీఆర్ ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. తాము చదువుకునే రోజుల్లో ప్రతి సబ్జెక్టుకు ఒక టీచర్ ఉండేవారని, నేడు ఒక టీచర్ అన్ని సబ్జెక్టులు చెప్పాల్సిన దౌర్భాగ్యం వచ్చిందన్నారు. నాణ్యమైన అందడం లేదన్నారు. ఉపాధ్యాయుల నియామకాలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం, బదిలీలు, పదోన్నతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవని, దీంతో చాలా మంది మహిళా టీచర్లు నీళ్లు తాగడంలేదన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేకనే పదవీ విరమణ వయస్సు 61సంవత్సరాలకు పెంచారని అన్నారు. హాస్టళ్లు, గురుకులాల్లో పురుగుల అన్నంపెట్టి ఒక్కో విద్యార్థిపై ఏడాదికి రూ.1.20లక్షలు ఖర్చు పెడుతున్నామని గొప్పలు చెప్తున్నారని, సరస్వతి తల్లులు ఆందోళనలు, సమ్మెలు చేస్తున్నా కనిపిస్తలేదా అని ప్రశ్నించారు. శాఖలపై చర్చలు చేసే తీరిక సీఎంకు లేదని, మంత్రులు, ఎమ్మెల్యేలకు కేసీఆర్‌తో మాట్లాడే ధైర్యం లేదని అన్నారు.

స్నేహితుల మధ్య వాగ్వాదం.. గుణపంతో దాడి.. యువకుడి మృతి



భానుప్రసాద్ (ఫైల్)

బిజినేపల్లి: ఇద్దరు యువకుల మధ్య మాట మాట పెరగడంతో ఓ యువకుడిపై గుణపంతో దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గుండెకు గాయం కావడంతో యువకుడు మృతిచెందిన సంఘటన బిజినేపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బిజినేపల్లిలోని వడ్డెమాన్ కమాన్ వద్ద బుధవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన భానుప్రసాద్(18), విక్టర్ సంతోష్ అనే యువకుడికి చెందిన టెంట్‌హౌస్‌లో బుధవారం మధ్యరాత్రి వరకు కూర్చున్నారు. ఇద్దరి మధ్య మాటల సందర్భంలో మాటమాట పెరగడంతో విక్టర్ పక్కనే ఉన్న చిన్నపాటి గుణపంతో భానుప్రసాద్ గుండె భాగంలో పొడిచాడు. దీంతో గుండెలో దిగిన గుణపంతోనే తనను రక్షించమని నాగర్‌కర్నూల్ వెళ్లే ప్రధాన రహదారిపైకి వచ్చాడు. ఒక వాహనదారుడు గుర్తించి పోలీసులకు చెప్పడానికి స్టేషన్‌కు వెళ్లగా కుక్కలను చూసి భయపడి వెనక్కి వచ్చాడు. అదే సమయంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి ఎస్కార్ట్‌గా వెళ్లి తిరిగి వస్తున్న పోలీసు వాహనానికి భానుప్రసాద్ రక్తపు మడుగులో కనిపించడంతో వెంటనే బిజినేపల్లి పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో నాగర్‌కర్నూల్‌కు తరలిస్తుండగానే మార్గమధ్యలోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీఐ హన్మంతు గురువారం ఉదయం ఆస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ విషయమై భానుప్రసాద్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణటబుల్‌రెడ్డి తెలిపారు. అయితే గంజాయి మత్తులోనే ఈ ఘటన చోటుచేసుకుందని సమాచారం.

విచ్చలవిడిగా గంజాయి

హత్యకు గురైన భానుప్రసాద్ గతంలో పోతిరెడ్డిపల్లిలో 16 కిలోల గంజాయితో పట్టుబడగా అప్పటి ఎస్‌ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. బిజినేపల్లిలో 40 నుంచి 50 మంది వరకు యువకులు గంజాయికి బానిసయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా గంజాయికి అలవాటు పడిన కొందరు యువకులు మధ్యరాత్రి స్థానిక బెల్టు దుకాణాలకు వెళ్లి హంగామా సృష్టిస్తున్నట్లు సమాచారం. కాగా బిజినేపల్లికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి సైతం బిజినేపల్లిలో గంజాయి లభిస్తుందని ఇటీవల ఆవేదన వ్యక్తం చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణే ముఖ్యం



గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వ్యాపించినప్పుడు ఎలా ఆర్పాలో చూపుతున్న అగ్నిమాపక సిబ్బంది

- డివిజినల్ ఫైర్ ఆఫీసర్ ఆర్.సుధాకర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు చేతులకు గ్లౌజులు, కాళ్లకు బూట్లు, తలకు హెల్మెట్ ధరించాలని డివిజినల్ ఫైర్ ఆఫీసర్ ఆర్.సుధాకర్ సూచించారు. జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం జేపీఎన్‌సీఈకి చెందిన మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు స్థానిక ఫైర్‌స్టేషన్‌లో 'పరిశ్రమల్లో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త'లపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు కలిగిన వస్తువులనే కొనాలన్నారు. ఇంట్లో వంట చేసేటప్పుడు ఆప్రాన్ ధరించాలని, గదిలో నాలుగు కిలోల బేకింగ్ సోడా ఉండేలా చూడాలన్నారు. కాగా, గ్యాస్ సిలిండర్ ద్వారా మంటలు సంభవించినప్పుడు ఎలా ఆర్పాలో ప్రయోగాత్మకంగా వివరించారు. ఎక్కడైనా అగ్నిమాపక సంఘటనలు జరిగినప్పుడు వెంటనే 101 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజినల్ ఫైర్ ఆఫీసర్ బి.ధర్మ, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పద్మయ్య, జేపీఎన్‌సీఈ సిబ్బంది డా.సాయికృష్ణ, సయ్యద్ ముస్తాక్‌అలీ, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయని ప్రధాన అర్చకులు విష్ణునారాయణ తెలిపారు. చివరిరోజు ఉదయం వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య గర్భగుడిలో శ్రీదేవి, భూదేవి సమేతంగా రంగనాథస్వామిని అలంకరించి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. రాత్రి అవభృతం, ధ్వజ అవరోహణ, తీర్థప్రసాద వితరణ, నాగవలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు గోవిందచార్యులు, సురేశాచార్యులు, కన్నయ్యస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న కిన్నెర సిద్దార్థ

ఉండవెల్లి: పేద విద్యార్థులకు ఉచిత విద్య, వైద్యం అందించాలని కోరుతూ ఉచిత విద్య, వైద్యం సాధన సమితి జాతీయ అధ్యక్షుడు కిన్నెర సిద్దార్థ డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా నుంచి ప్రారంభించిన బైక్‌యాత్ర గురువారం ఉండవెల్లికి చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ఉన్నత విద్య చదివేందుకు 25శాతం ఉచితంగా సీట్లు కేటాయించాలని, 55:45 నిష్పత్తిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లు దేశంలోని 9రాష్ట్రాల్లో అమలవుతోందని, తెలంగాణలో ఎందుకు అమలుకావడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా తెలంగాణలో చట్టాన్ని అమలుచేయాలని కోరారు.

ఏడు నెలల చిన్నారికి డెంగీ



మల్లెబోయిన్‌పల్లిలో పర్యటిస్తున్న వైద్య సిబ్బంది

జడ్చర్ల టౌన్: మండలంలోని మల్లెబోయిన్‌పల్లి గ్రామానికి చెందిన ఏడు నెలల చిన్నారికి డెంగీ నిర్ధారణ అయ్యింది. ఆదివారం జ్వరం రాగా జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స అందిస్తూ మంగళశారం రక్త నమూనాలు సేకరించి, పరీక్షలు చేశారు. బుధవారం డెంగీగా నిర్ధారించారు. అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ గురువారం గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టింది. చిన్నారి ఇంటి పరిసరాలు, ఇంట్లో ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు జనార్దన్, శ్రీధర్‌రెడ్డి, రమణ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత, వ్యక్తిపై కేసు నమోదు



నల్లబెల్లం బస్తాలు, నిందితుడితో ఎక్సైజ్ ఎస్‌ఐలు

బల్మూర్: నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని నర్సాయపల్లిలో గురువారం తెల్లవారుజామున నిర్వహించిన సోదాల్లో ఒక వ్యక్తి ఇంట్లో నుంచి నాటుసారా తయారీకి ఉపయోగించే నిషేధిత నల్లబెల్లం పట్టుకున్నారు. సోదాల్లో గ్రామానికి చెందిన రామావత్ రాజు ఇంట్లో 17 బస్తాల్లో దాచిన 510 కిలోల బెల్లం, 50 కిలోల పట్టికను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐలు బాలరాజు, సతీష్ తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లు



గన్‌పార్కులో అమరవీరుల స్తూపం వద్ద ఎమ్మెల్సీ అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా శాసనమండలి బీఆర్‌ఎస్ అభ్యర్థులు గురువారం తమ నామినేషన్లను దాఖలు చేశారు. పార్టీ అభ్యర్థులు దేశపతి శ్రీనివాస్, నవీన్ కుమార్, చల్లా వెంకట్రామిరెడ్డి తమ నామినేషన్ పత్రాలను శాసనసభలో రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. కార్యక్రమానికి మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు బాల్క సుమన్, గువ్వల బాల్‌రాజ్, శంబీపూర్‌రాజు సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అంతకుముందు ఎమ్మెల్సీ అభ్యర్థులు గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు.

పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థికి మద్దతు



సాక్షి, హైదరాబాద్: టీటీజేఏసీ, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పీఆర్‌టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ మద్దతు ప్రకటించింది. పీఆర్‌టీయూటీఎస్ నేతలు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్‌ను గురువారం టీఎస్‌సీపీఎస్‌ఈయూ నేతలు శ్రీకాంత్, నరేష్‌గౌడ్ కలిసి ఈమేరకు మద్దతు ప్రకటించారు.

గాల్‌రెడ్డిని గెలిపించండి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డిని గెలిపించాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఉపాధ్యాయ ఓటర్లకు గురువారం బహిరంగ లేఖ రాశారు.

11 నుంచి హాకీ క్రీడాకారుల ఎంపికలు



వనపర్తి క్రైం: జిల్లాకేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడామైదానంలో ఈ నెల 11, 12 తేదీల్లో జాతీయస్థాయి హాకీ క్రీడాకారుల ఎంపికలు జరగనున్నాయని జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి కుమార్ తెలిపారు. గురువారం ఆయన క్రీడా మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాతీయస్థాయి జూనియర్ బాలుర, అండర్–17 సౌత్ జోన్ బాలుర, బాలికల ఎంపికలు ఉంటాయన్నారు. 31 జిల్లాల హాకీ జట్లు పాల్గొంటాయని, ఎంపికలకు రాష్ట్ర హాకీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ముఖేష్, కోశాధికారి భాస్కర్‌రెడ్డి, చైర్మన్ విజయకుమార్, అధ్యక్షుడు తల్వార్ రానున్నట్లు వివరించారు. ఆయన వెంట కోచ్‌లు జావిద్, సాగర్, ఆదిత్య, వహీద్ ఉన్నారు.

ప్రమాదాలపై విద్యుత్ ఉద్యోగులకు అవగాహన



దోమలపెంట: టీఎస్ జెన్‌కో పరిధిలోని శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ విద్యుత్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు గురువారం ప్రమాదాలపై అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా కేంద్రంలోని ఎత్తైన భవనం (ఎంసీఆర్) మెయిన్ కంట్రోల్ రూం పైభాగంలో విధుల్లో ఉన్న సిబ్బంది ప్రమాదానికి, ఆందోళనకు గురైన సందర్భాల్లో తక్షణం వైద్య సేవలందించడం కోసం ఘటనా స్థలి నుంచి సురక్షితంగా, వేగంగా చైర్ అండ్ నాట్ పద్ధతిలో కిందకి దించి ఆస్పత్రికి తరలించే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ మేనేజర్ డీఈ శ్రీకుమార్‌గౌడ్ మాట్లాడుతూ జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆరు రోజుల నుంచి ఉద్యోగులకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీఈ సూర్యనారాయణ, జెన్‌కో (హెచ్‌పీసీ, విద్యుత్ సౌధ) సద్గుణకుమార్, ఎస్ఈ (ఓఅండ్ఎం) ఆదినారాయణ, ఎస్ఎఫ్ఓ మల్లికార్జున్, ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కుటుంబ పాలనే బీఆర్‌ఎస్ మోడల్!

'కరీంనగర్ కవాతు' బహిరంగ సభలో ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భాగేల్

- తెలంగాణలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేవు
- కేసీఆర్ కుటుంబంలో మాత్రం అందరికీ ఉద్యోగాలు వచ్చాయి
- తాము రైతులకు మద్దతు ధర, పంట మార్పిడికి ప్రోత్సాహం ఇస్తున్నామని వెల్లడి
- తెలంగాణలో ఛత్తీస్‌గఢ్ మోడల్ అమలు చేస్తాం: రేవంత్‌రెడ్డి



బహిరంగసభలో ప్రసంగిస్తున్న ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భాగేల్. వేదికపై దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావ్ ఠాక్రే, భట్టి, జైరాం రమేశ్, జీవన్‌రెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ''తెలంగాణ వచ్చినా రైతులు, నిరుద్యోగులకు ఉద్యోగ , ఉపాధి అవకాశాలు లభించలేదు. కానీ కేసీఆర్ కుటుంబంలోని కేటీఆర్, హరీశ్‌రావు, లిక్కర్ క్వీన్ కవితకు ఉద్యోగాలు వచ్చాయి..'' అని ఛత్తీస్‌గఢ్‌సీఎం, కాంగ్రెస్ నేత భూపేశ్ భాగెల్ మండిపడ్డారు. దేశ సంపద అంతా ఒకరిద్దరి చేతుల్లోకి వెళ్లిందని.. అది బీజేపీ గుజరాత్ మోడల్ అని.. అదే తెలంగాణలో కుటుంబ పాలన బీఆర్‌ఎస్ మోడల్ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ 'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర కరీంనగర్‌కు చేరుకున్న సందర్భంగా.. గురువారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో 'కరీంనగర్ కవాతు' పేరిట బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ జైరాం రమేశ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సురేశ్ షెట్కార్, సిరిసిల్ల రాజయ్య, వీహెచ్, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సభలో భూపేశ్ భాగెల్ ప్రసంగిస్తూ.. ఛత్తీస్‌గఢ్‌లో రైతుల ధాన్యానికి మద్దతు ధర రూ.2,640, నిరుద్యోగ భృతి కింద రూ.2,500, పంటమార్పిడికి రూ.9,000, పేడ కిలోకి రూ.2తోపాటు గోమూత్రానికి కూడా డబ్బులు చెల్లిస్తూ.. గ్రామీణుల జీవితాల్లో వెలుగులు నింపామని చెప్పారు. తెలంగాణలోనూ కాంగ్రెస్‌ను గెలిపించాలని, ఛత్తీస్‌గఢ్ మోడల్‌ను అమలు చేద్దామని పిలుపునిచ్చారు.

రైతులు, నిరుద్యోగులకు పెద్దపీట: రేవంత్

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, ఛత్తీస్‌గఢ్ మోడల్‌తో రైతులకు, నిరుద్యోగులకు పెద్దపీట వేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పారు. ''తెలంగాణ రాష్ట్రం ఇస్తే రాజకీయంగా ఏపీలో నష్టపోతామని తెలిసినా.. మాటకు కట్టుబడి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చింది. కానీ నీళ్లు, నిధులు, నియామకాల పేరిట తెలంగాణలో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ రైతులు, యువతను దగా చేశారు. కరీంనగర్ నుంచి కేసీఆర్, బి.వినోద్, బండి సంజయ్‌లు ఎంపీలుగా గెలిచి ఏం సాధించారు? అదే 2009లో పొన్నం ప్రభాకర్‌ను ఒక్కసారి ఎంపీగా గెలిపిస్తే.. తెలంగాణ తెచ్చి చూపించారు. తెలంగాణ బిల్లు పెట్టిన రోజున సమైక్యవాదులు స్పీకర్ కళ్లలో కారం కొట్టి బిల్లును ఆపాలని చూసినా.. జైపాల్‌రెడ్డి వ్యూహం, తెలంగాణ ఎంపీల తెగువతో బిల్లు ఆమోదం పొందింది. కానీ తల్లిని చంపి, బిడ్డను బతికించారంటూ ప్రధాని మోదీ తెలంగాణ ఆవిర్భావాన్ని అవహేళన చేశారు. ఆయనకు ఎలా ఓటేస్తారు?'' అని రేవంత్ ప్రశ్నించారు. తెలంగాణ మనుగడ కోసం విభజన చట్టంలో బయ్యారం ఉక్కు పరిశ్రమ, ఐటీఐఆర్ ప్రాజెక్టు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన వర్సిటీ, ఐఐటీ వంటివాటిని చేర్చితే.. అవేమీ అమలుకు నోచుకోలేదన్నారు. సీఎం కేసీఆర్ 3 వేల వైన్ షాపులు, 60వేల బెల్టుల షాపులతో తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. మోసపూరిత గుజరాత్ మోడల్ కావాలో, తాగుబోతుల తెలంగాణ మోడల్ కావాలో, రైతులు–యువత అభ్యున్నతికి ఛత్తీస్‌గఢ్ మోడల్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు.

బలహీన వర్గాల కోసమే తెలంగాణ: మాణిక్‌రావ్ ఠాక్రే

ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, బీసీల అభ్యున్నతి కోసమే సోనియాగాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని, కానీ గత 8 ఏళ్లలో ఈ ఆకాంక్షలేవీ నెరవేరలేదని మాణిక్‌రావు ఠాక్రే పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు పెరిగాయని ఆరోపించారు.

కేసీఆర్‌ను ఓడించాలి: జైరాం రమేశ్

ఛత్తీస్‌గఢ్ మోడల్‌లో రైతుల జీవితాల్లో వెలుగులు కనిపిస్తున్నాయని.. దానిని తెలంగాణలో అమలు చేయాలని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ''కేసీఆర్ నిజాంలా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. కేసీఆర్ హఠావో.. తెలంగాణ బచావో'' అని పిలుపునిచ్చారు.

ఆదిశంకరాచార్య తర్వాత రాహుల్ గాంధీనే: ఉత్తమ్

ఆది శంకరాచార్య తర్వాత దేశమంతా తిరిగిన వ్యక్తి రాహుల్ గాంధీ మాత్రమేనని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. విద్వేషాన్ని విడిచి దేశ సమైక్యతను కాపాడాలని రాహుల్ సందేశం ఇచ్చారన్నారు. తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు.

సామాజిక తెలంగాణ ఏర్పడలేదు: మల్లు భట్టివిక్రమార్క

ప్రజలు కోరుకున్న సామాజిక తెలంగాణ ఏర్పడలేదని, ప్రాణహితకు అంబేద్కర్ పేరును తొలగించారని భట్టి విక్రమార్క చెప్పారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేకపోయారని, కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టుల నీటితోనే పంటలు పండుతున్నాయని పేర్కొన్నారు. భూమి లేని నిరుపేదలకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.7 వేలు ఇస్తోందని.. కానీ ఇక్కడ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏమీ ఇవ్వడం లేదని విమర్శించారు.

అవినీతి వల్లనే 'వీఆర్వో' వ్యవస్థ రద్దు

హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వ వాదనలు

సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయిలో విపరీతంగా అవినీతి పెరిగిపోయిన కారణంగానే వీఆర్వో వ్యవస్థను రద్దు చేశామని హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినిపించింది. వందల మంది వేరే డిపార్ట్‌మెంట్లలో చేరారని, కేవలం 60 మంది మాత్రం రెవెన్యూ విభాగంలోనే కొనసాగించాలని కోరడం సరికాదని పేర్కొంది. రెవెన్యూశాఖలో ఖాళీలున్నా తమను ఇతర శాఖల్లోకి పంపడం అన్యాయమని పేర్కొంటూ వీఆర్వోలు హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై గతంలో విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం వీఆర్వోలను ఇతర శాఖలకు తరలించడంపై స్టే విధించింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం గురువారం మరోసారి విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ వాదనలు వినిపించారు. 'రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలతోనే వీఆర్వోలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేయడానికి మార్గదర్శకాలు జారీచేసింది' అని పేర్కొన్నారు. తదుపరి విచారణ కోసం వాదనలను మార్చి 20వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.


మా వాళ్ల అమ్మాయినే ప్రేమిస్తావా?



ఘటన జరిగిన తీరును పోలీసులను అడిగి తెలుసుకుంటున్న బీజేపీ నేత టి.ఆచారి

- మాటు వేసి.. కత్తులు దూసి.. గిరిజన యువకుడి దారుణహత్య
- హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో సంఘటన
- నిందితులపై చర్యలకు బీజేపీ, గిరిజన సంఘాల డిమాండ్

పహాడీషరీఫ్/వెల్దండ: ప్రేమ వ్యవహారం కారణంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లో చోటుచేసుకున్న గిరిజన యువకుడి హత్యోదంతం ఘటన మరువక ముందే బాలాపూర్‌లో మరో గిరిజన యువకుడు బుధవారం రాత్రి దారుణ హత్యకు గురవ్వడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కుప్పగండ్ల కేస్లీతండాకు చెందిన డెకావత్ ఫూల్‌సింగ్ భార్యాపిల్లలతో 20 ఏళ్ల క్రితం షాహిన్‌నగర్‌లోని వాదే ఉమర్ బస్తీకి వలసొచ్చారు. మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు పవన్‌నాయక్(22) సంతానం. ఇంటర్ పూర్తి చేసి ప్రస్తుతం చదువు మానేసిన పవన్ ఏడాది నుంచి సమీప బస్తీలో ఉండే వేరే వర్గానికి చెందిన యువతితో ప్రేమ వ్యవహారం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం యువతి ఇంట్లో తెలియడంతో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి 11గంటల సమయంలో పవన్ మూత్ర విసర్జన కోసం బయటికి వచ్చాడు. అప్పటికే కాపు కాసి ఉన్న యువతి కుటుంబ సభ్యులైన సద్దాం, గౌస్ కత్తులతో ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు. కడుపు, వీపు, మెడ భాగాల్లో విచక్షణారహితంగా పొడిచి పరారయ్యారు. తీవ్ర గాయాలతో పవన్ కేకలు వేస్తూ ఇంట్లోకి పరుగు తీసి కుప్పకూలాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా పవన్ మార్గమధ్యలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మహేశ్వరం డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, ఏసీపీ అంజయ్య, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనపై హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



పవన్‌నాయక్ (ఫైల్)

గిరిజనులకు రక్షణ లేదు..

పవన్‌ను చంపిన కేసులో నేరచరిత్ర ఉన్న నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని బీజేపీ నేతలు టి.ఆచారి, బొక్క నర్సింహారెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. గిరిజనులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని నంగార భేరి లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ భానావత్ శంకర్ నాయక్ డిమాండ్ చేశారు.

పవన్ మృతి విషయం తెలుసుకున్న బంధుమిత్రులు పెద్ద ఎత్తున బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఆందోళనకు దిగారు. కాగా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితులకు నేర చరిత్ర ఉన్నట్లు కూడా తెలిసింది.

కేస్లీతండాలో విషాదఛాయలు

వెల్దండ మండలంలోని కేస్లీతండాకు చెందిన పవన్ హత్యకు గురవడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం కేస్లీతండాకు తీసుకువచ్చి గురువారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

డబ్బులతో రాజీ ప్రతిపాదన లేకుంటే.?

ఇరు కుటుంబాల నడుమ గొడవలు నెలకొన్న సమయంలో మధ్యవర్తులు డబ్బులతో రాజీ ప్రతిపాదన చేయకుండా ఉంటే పవన్ హత్య జరిగేది కాదని మృతుడి బంధువులు ఆవేదన వ్యక్తంచేశారు. వారు అడిగిన డబ్బు కొద్ది సమయంలో ఇస్తామని చెప్పినా తమ కొడుకును పొట్టన పెట్టుకున్నారని మృతుడి తండ్రి ఫూల్‌సింగ్ బోరున విలపించాడు.

ముగిసిన ప్రీబిడ్ సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్, చిత్రంలో అదనపు కలెక్టర్ సీతారామరావు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అమిస్తాపూర్ సారిక టౌన్‌షిప్, పోతులమడుగు టౌన్‌షిప్‌కు సంబంధించిన ప్రీబిడ్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ.. ఆయా టౌన్‌షిప్‌లు ప్రభుత్వ ఆధ్వర్యంలో రూపొందించినవని.. ఓపెన్ ప్లాట్లకు ఈ నెల 16 నుంచి 18 వరకు పట్టణంలోని బాదం రామస్వామి ఆడిటోరియంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ సీతారామారావు ఆయా టౌన్‌షిప్‌లోని ప్లాట్ల గురించి వివరించారు. హౌజింగ్ సొసైటీ పీడీ వైద్యం భాస్కర్, ఎల్‌డీఎం భాస్కర్ ప్లాట్ల కొలతలు, రహదారులు, వసతులు, బ్యాంకు రుణం తదితర వివరాలను తెలియజేశారు. అమిస్తాపూర్‌లోని సారిక టౌన్‌షిప్‌లోని 96 ప్లాట్లకు 17, 18 తేదీల్లో, పోతులమడుగులో ఉన్న 160 ప్లాట్లకు 16, 17, 18 తేదీల్లో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ధరావత్తు కింద రూ.10 వేలు చెల్లించాలని కలెక్టర్ తెలిపారు. మరిన్ని వివరాలకు http://mahabubnagar.telangana.gov.in,unda.gov.in./auctions/ tsiic.telangana.gov.in,swagruha.telangana.gov.inలో,08542-241165,7675075365, 7993455775లో పొందవచ్చని వెల్లడించారు.

బీఆర్‌ఎస్‌కు వనపర్తి జెడ్పీ చైర్మన్ రాజీనామా

ఇద్దరు ఎంపీపీలు, 11 మంది సర్పంచ్‌లు..

- ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు, ఒక సింగిల్ విండో డైరెక్టర్..
- పలువురు ఉప సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు సైతం అదేబాటలో
- సల్కెలాపూర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడి
- ఆత్మాభిమానం చంపుకోలేకేనన్న నేతలు
- మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఇలాకా వనపర్తి జిల్లాలో భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)లో ముసలం మొదలైంది. మంత్రికి సన్నిహితులుగా పేరొందిన ముఖ్య నాయకులు సైతం పార్టీకి రాజీనామా చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్ రెడ్డితోపాటు వనపర్తి, పెద్దమందడి ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఐ.సత్యారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డి రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. ఈ మేరకు ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపూర్ గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు పత్రాలు ప్రదర్శించారు. వీరితో పాటు మరో 11 మంది సర్పంచ్‌లు, ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు, పలువురు ఉపసర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు రాజీనామా చేస్తున్నట్లు స్వయంగా ప్రకటించడమే కాకుండా బీఆర్‌ఎస్ లో తాము ఎదుర్కొన్న బాధలను వెళ్లగక్కారు.

ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేక..: ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ మామూలు కార్మికులు సైతం ఆత్మగౌరవం కోరుకుంటారని.. అలాంటిది అధికారంలో ఉండి కూడా ఆత్మగౌరవాన్ని పొందలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌లో ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేకే రాజీనామా చేసినట్లు వెల్లడించారు.

నిరంజన్‌రెడ్డికి పేరొచ్చిందంటే మేమే కారణం

పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి మాట్లాడుతూ మంత్రి నిరంజన్‌రెడ్డికి నీళ్ల నిరంజన్‌రెడ్డి అనే పేరు వచ్చేందుకు తమ శ్రమే కారణమన్నారు. ఈ ప్రాంతానికి నీళ్లు తెచ్చింది ఎవరో వారి మనసులో ఉందని.. త్వరలోనే వారు బాహాటంగా చెప్పే రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నియంత పాలన అంతం కోసం ఇక నుంచి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని చెప్పారు. కాగా, నియోజకవర్గంలో ఇప్పటివరకు తిరుగులేని నాయకుడిగా పేరు తెచ్చుకున్న మంత్రి నిరంజన్ రెడ్డికి అతడి సొంత సెగ్మెంట్ నుంచే వ్యతిరేకత పెల్లుబికడంతో పాటు తాజా పరిణామాలు ఎదురుదెబ్బేనని రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

కలుషితాహారంతో 70 మంది విద్యార్థినులకు అస్వస్థత

- మహబూబాబాద్‌లోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఘటన
- ఆందోళన చెందొద్దని రాష్ట్ర మంత్రి సత్యవతి భరోసా



ఆక్సిజన్ వార్డులో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

నెహ్రూసెంటర్/మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో కలుషితాహారం కారణంగా 70 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారంరాత్రి విద్యార్థినులు టమాట కూర, సాంబారు, మజ్జిగతో భోజనం చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే కొంతమంది విద్యార్థినులకు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో పాఠశాలలో ఏఎన్ఎం, స్పెషల్ ఆఫీసర్ మందులు అందించారు. గురువారం ఉదయం బాధిత విద్యార్థినులకు గ్లూకోజ్, ఓఆర్ఎస్ కలిపి తాగించారు. అయినా వారికి వాంతులు, విరేచనాలు అవుతుండటంతో తొలుత పాఠశాలలోనే వైద్యులతో వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో 36 మందిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వారిలో కొందరికి ఆక్సిజన్ పెట్టారు. మరో 34 మంది విద్యార్థినులను హాస్టల్ గదుల్లోనే నేలపై పడుకోపెట్టి చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారికి ఎలాంటి ప్రాణపాయం లేదని వైద్యులు తెలిపారు. దీనిపై కేజీబీవీ ఎస్‌ఓ భవానిని వివరణ కోరగా బుధవారంరాత్రి ఆరుగురు విద్యార్థినులకు కడుపునొప్పి, వాంతులు కావడంతో మందులు వేశామని, ఉదయం మరి కొంత మందికి అదే పరిస్థితి ఎదురుకావడంతో జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు. విద్యార్థినులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై మంత్రి ఆరా..

కస్తూర్బాగాంధీ విద్యాలయంలో కలుషితాహారం విషయం తెలియగానే జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారితో రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖల మంత్రి సత్యవతి రాథోడ్ ఫోన్‌లో మాట్లాడి విద్యార్థుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. విషయం తెలుసుకున్న ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావులు ఆస్పత్రికి చేరుకుని విద్యార్థినులను పరామర్శించారు.

ముగిసిన రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



రంగు నీళ్లు తీసుకొస్తున్న గ్రామస్తులు

- చివరిరోజు కోనేరులో స్వామివారికి త్రిశూలస్నానం
- శ్రీరామనవమి వరకు జాతర కొనసాగింపు

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. చివరిరోజు ప్రధాన ఆలయంలోని శివలింగానికి అర్చకులు రామలింగశర్మ, నర్సింహశర్మ, మణికంఠశర్మ, యాదగిరిశర్మ, సందీప్‌శర్మ అభిషేకించి స్వామివారి వెండి ముఖాన్ని పూలతో, గౌరమ్మ ఆలయంలో అమ్మవారి మూల విగ్రహాన్ని చీర, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రి వృషభ వాహనసేవ నిర్వహించారు. రుద్రాభిషేకం, రుద్రహోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు జరిపించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ఆలయం ముందు ఊరేగించి కుంభాభిషేకం చేశారు. కందూర్‌లో వసంతోత్సవం నిర్వహించిన తర్వాత రంగునీళ్లతో గ్రామస్తులు ఆలయానికి చేరుకొని కోనేరులో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు త్రిశూలస్నానం చేయించి ఉత్సవాలు ముగించారు. రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగియడంతో శుక్రవారం నుంచి జాతర ప్రారంభం కానుంది. ఇప్పటికే ఆలయ పరిసరాల్లో దుకాణాలు వెలిశాయి. ఏటా బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత ఉగాది పండుగ వరకు జాతర కొనసాగేది. అయితే వరుసగా ఎనిమిదో ఏడాది కూడా జాతరను ఈ నెల 30న జరిగే శ్రీరామనవమి వరకు పొడిగించారు. కార్యక్రమంలో ఎస్ఐ విజయకుమార్, సర్పంచ్ శ్రీకాంత్, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, ఈఓ రాజేశ్వరశర్మ, ఆలయ సిబ్బంది అనంతసేన్‌రావు, గ్రామస్తులు నరేందర్, ప్రభాకర్‌రెడ్డి, రమేష్, చంద్రమౌళి, లక్ష్మయ్య, రామలింగం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వృషభ వాహనసేవ

వైభవం.. వసంతోత్సవం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ అలివేలు మంగతాయారు ఉత్సవాల్లో భాగంగా గురువారం వసంతోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు పూర్ణాహుతి, అవభృతస్నానం, నాకబలి (నాగవెల్లి), ద్వాదశారాధన, సప్తవరణులు, మహదాశీర్వచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి సుదర్శన పెరుమాళ్లకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం నుంచి గుట్టపైనున్న బావి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ పురోహితులు సంప్రదాయ రీతిలో శ్రీచక్రస్నానం నిర్వహించారు. అనంతరం పెరుమాళ్లను పూలతో శోభాయమానంగా అలంకరించి తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. దీంతో ఉత్సవాలు ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారి విశేషోత్సవాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



సుదర్శన పెరుమాళ్లకు శ్రీచక్రస్నానం చేయిస్తున్న పురోహితులు